ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం భేష్

- ఢిల్లీ బృందం ప్రశంస
- మధురానగర్ హైస్కూల్ సందర్శన
- 'విద్యా' పథకాల అమలు.. బోధన, అభ్యసన కార్యక్రమాల పరిశీలన


మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల సందర్శనలో ఢిల్లీ బృందం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలను సోమవారం నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ ఆఫ్ మెంటార్ టీచర్స్ ఆఫ్ ఢిల్లీ బృందం సందర్శించింది. 30 మందితో కూడిన ఈ బృంద సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్టమైన విద్యా విధానం కోసం, విద్యా శాఖలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన బడి నాడు–నేడు, జగనన్న విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలు, బైజూస్ ట్యాబ్స్, వంద రోజుల ప్రణాళిక, ఇంగ్లిష్ మీడియం బోధన వంటి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి ప్రశంసించారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల స్థాయిలను గుర్తించి అభినందించారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళిక, డైరీ, టీచింగ్ నోట్సులతోపాటు బోధన, అభ్యసన కార్యక్రమాలను పరిశీలించి వాటి గురించి విపులంగా తెలుసుకున్నారు.

విద్యా బోధనపై సంతృప్తి

10వ తరగతిలో విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణత కోసం జిల్లా విద్యా శాఖ అధికారులచే తయారు చేసిన వంద రోజుల ప్రణాళిక అమలును పరిశీలించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్ ప్రయోజనాలను, బైలింగ్వల్ పాఠ్య పుస్తకాల ప్రయోజనాలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ ఢిల్లీ స్కూల్స్ ఉపాధ్యాయులు, ఢిల్లీ డైట్ ప్రిన్సిపాల్ ఎం.రామ్‌కిషోర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలనాయుడు, డిప్యూటీ ఈవో గౌరీశంకర్, ఏపీసీ శ్రీనివాసరావు, డీఐ సువర్ణ, మధురానగర్ పాఠశాల హెచ్‌ఎం డి.శాంతికుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న బృంద సభ్యులు


బైజూస్ కంటెంట్ ప్రయోజనాన్ని వివరిస్తున్న 8వ తరగతి విద్యార్థిని

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన కె.కె.రాజు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కలిశారు. సీఎం ఆధ్వర్యంలో పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో భాగంగా ఆయనను కలిసి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అందిన వినతులను, నియోజకవర్గ అభివృద్ధి పనులపై సీఎంకు కె.కె.రాజు వినతిపత్రం అందజేశారు.

'స్పందన'కు 20 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైతన్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా రైతుబజార్


రైతుబజార్‌లో అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

సీతమ్మధార: రైతుబజార్లు ప్లాస్టిక్ రహితంగా మారాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం ప్లాస్టిక్ సంచుల నిషేధం, తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలని, చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు వాడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, సచివాలయం సెక్రటరీలు, రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ దరి ఇందిరానగర్‌కు చెందిన రెడ్డి సత్యనారాయణ ఆదివారం రాత్రి ఇంటి నుంచి సర్వీస్ రోడ్డుపైకి స్కూటీతో వస్తుండగా.. ఒక గుర్తు తెలియని బైకు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కిందపడిపోయిన సత్యనారాయణ కాలుకు గాయమైంది. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

➠ షీలానగర్‌కు చెందిన ద్వారపూడి లీలావతి అనే మహిళ లాయర్ విధులు నిర్వర్తించుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. ఊర్వశి కూడలి వద్ద ప్రమాదానికి గురయ్యారు. అక్కడ ఆగి ఉన్న కారులోని వ్యక్తి డోర్ ఒక్కసారిగా తెరవడంతో ఆమె కింద పడిపోయి గాయాలపాలయ్యారు. లీలావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


అధికారులతో సమీక్షిస్తున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. ప్రజల నుంచి వాటిని ఆయన స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 02, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు సమర్పించినట్లు జెడ్సీ తెలిపారు. అనంతరం జోనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పందన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్(రెవెన్యూ) పి.బాబూరావు, పబ్లిక్ హెల్త్ శానిటరీ సూపర్‌వైజర్ జనార్దనరావు, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్న, వాటర్ వర్క్స్ డీఈ శ్రీనివాసవర్మ, ఏపీడీ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు


సత్యం సెంటర్‌లో నిఘా కెమెరాకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జాతీయ రహదారిపై సత్యం సెంటర్‌లో ఉన్న నిఘా కెమెరాలకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డు డివైడర్‌పై ఉన్న సీసీ కెమెరాల్లో ఫోకస్ తగ్గడంతో సీసీ ఫుటేజీలో నాణ్యత లోపించింది. ఇటీవల సంభవిస్తున్న ప్రమాదాలు, నేరాల్లో సీసీ ఫుటేజీ కీలకంగా మారిన నేపథ్యంలో కెమెరాల పనితీరుపై పోలీసు శాఖ దృష్టి సారించింది. వచ్చే నెల నగరంలో జీ20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో నిఘా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కారణంగా ప్రధాన రహదారులు, కూడళ్లలో నిఘా కెమెరాలకు మరమ్మత్తులు చేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగుల పిల్లల్లో 2022 పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసింది. వీఐపీ రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి విద్యార్థులను అభినందించి, మెరిట్ స్కాలర్‌షిప్స్‌ను అందించారు. పదో తరగతిలో 10కి 10 గ్రేడ్స్ సాధించిన, ఐఐటీ, మెడికల్, ఇంజినీరింగ్ వంటి పోటీ పరీక్షల్లో ర్యాంకర్లు పొందిన సుమారు 125 మంది స్కాలర్‌షిప్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్/చిత్రలేఖనం, వ్యాసరచన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో విజేతలైన 21 మందికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్‌లు కవితా గుప్తా, మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, ట్రెజరర్స్ బిదిషా చటర్జీ, ఇతర ప్రతినిధులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి


శ్రీ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులతో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు, మాధవ్

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీ స్టార్ వాకర్స్ క్లబ్‌లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని క్లబ్ సభ్యులను కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, ఆదిబాబు, గోపాలరావు, అరకు జిల్లా ఇన్‌చార్జి పరశురామ్, ఉత్తర నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సాయిరాం(ఫైల్)

సీతమ్మధార: మద్యానికి బానిసై ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. పసుపులేటి సాయిరాం (28) అనే యువకుడు తల్లి జానకమ్మతో కలిసి అక్కయ్యపాలెంలో నివసిస్తున్నాడు. ఏసీ మెకానిక్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన సాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు సాయిని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. తల్లి ఫిర్యాదు మేరకు ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష


సమీక్షలో పాల్గొన్న కార్పొరేటర్లు

సీతమ్మధార: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్లు సమీక్ష నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఇన్‌చార్జుల నియామకం, ఓటర్లతో మమేకమై చేపట్టే ప్రచారాలపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజిని, కె.వి.ఎన్.శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

19న 'సహజ యోగ' సాధన

బీచ్ రోడ్డు: ఒత్తిడిని జయించి, మానసిక ప్రశాంతత పొందేందుకు ప్రతి ఒక్కరూ సహజ యోగము సాధన చేయాలని కలెక్టర్ మల్లికార్జున సూచించారు. ఏయూలో ఈ నెల 19న నిర్వహించనున్న సహజ యోగము..నేటి మహాయోగము కార్య క్రమం పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ నిరంతరం వివిధ రకాల ఒత్తిళ్లతో సతమతమవుతున్నారని, వాటి నుంచి ఉపశమనం కోసం సహజ యోగము ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహజ యోగము నేటి మహా యోగము కార్యక్రమ ప్రతినిధులు మధుసూదన్, కెప్టెన్ బాబూరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టెక్నో ప్రెన్యూర్‌షిప్‌తో ఆత్మనిర్భర్ భారత్ సాకారం


సదస్సులో పాల్గొన్న వక్తలు

ఏయూ క్యాంపస్: టెక్నో ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధితో ఆత్మ నిర్భర్ భారత్ సాకారం అవుతుందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏయూ డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సదస్సును డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీస్ విశాఖపట్నం కేంద్ర ప్రధాన అధికారి ఆర్.ఎల్.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ యువతను టెక్నోప్రెన్యూర్ అవకాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఐపీ ఇన్నోవేషన్, స్టార్టప్ రంగాలలో యువతను మలచాల్సిన ప్రాధాన్యత వివరించారు. దేశంలో ఆవిష్కరణ కేంద్రంగా విశాఖ నగరం నిలుస్తుందన్నారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త ఆచార్య హెచ్.పురుషోత్తం మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అతిపెద్ద ఐపీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వ్యవస్థను నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఎన్ఐ–ఎంఎస్ఎంఈ సీనియర్ ఫ్యాకల్టీ జి.సుదర్శన్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, డాక్టర్ అనింద్య రాయ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

వికేంద్రీకరణతోనే సుపరిపాలన సాధ్యం

ఏయూ క్యాంపస్: మార్చి నెలలో విశాఖ వేదికగా నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ రాష్ట్రంలో పారిశ్రామిగ పురోగాభివృద్ధికి దోహద పడుతుందని మాజీ వీసీ డా వి.బాలమోహన్‌దాస్ అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడర్ డాక్టర్ వైఎస్‌ఆర్ మేధావుల ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అధ్యక్షతన ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగంలో 'సుపరిపాలనలో యువత పాత్ర' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ పయనిస్తుందని, ఇది పరిపాలన వికేంద్రీకరణతోనే సాధ్యమన్నారు. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయం స్వాగతించాల్సిన విషయమని చెప్పారు.

విశ్రాంత ఆచార్యులు డాక్టర్ తిమ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రజల జీవన ప్రమాణాలు, పెరగడం, ఆనందకర జీవనం సాగించడమే నిజమైన అభివృద్ధి అని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. యువత ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకుని ప్రతి స్పందించి సుపరిపాలనలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకటరావు, ప్రొఫెసర్ డాక్టర్ పార్వతీశం, విద్యావేత్త ఎస్.అప్పలనారాయణ, ఉపాధ్యాయుడు వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు - శిక్షణ

టెన్నిస్ పోటీల్లో ప్రతిభావంతులకు ప్రశంసలు


క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ కన్నా

సీతమ్మధార: గుంటూరు నరసరావుపేటలో ఇటీవల జరిగిన 66వ రాష్ట్ర పాఠశాల అండర్ 17 టెన్నిస్ పోటీల్లో విశాఖ యువత ప్రతిభ చూపారు. మొదటి స్థానంలో నిషిత ఆరిమిల్లి, ద్వితీయ స్థానంలో నిలిచిన కిరణ్‌కుమార్‌లను కోచ్ కన్నా ప్రశంసించారు. మూడు, నాలుగు స్థానాల్లో శివాజీ పిల్ల, నిశాంత్ దేవరపల్లితోపాటు బాలికల పోటీల్లో మొదటి స్థానంలో హర్షిణి విశ్వంద్, ద్వితీయ స్థానంలో మోక్ష ధనుంజయ, మూడో స్థానంలో భావన, నాలుగు, ఐదు స్థానాల్లో హిమజారెడ్డి, చరిష్మా నిలిచారు. ఈమేరకు సోమవారం సీతమ్మధారలో నిర్వహించిన కార్యక్రమంలో విజయం సాధించిన బాల, బాలికలను కోచ్ అభినందించారు.

గోల్డ్ కప్ విజేత మణికంఠకు అభినందన


గోల్డ్ కప్‌తో పాండవ మణికంఠ

సీతంపేట: ఈ నెల 10 నుంచి 12 వరకు జైపూర్‌లో జరిగిన ఫిట్ ఇండియా ఫుట్‌బాల్ 8వ నేషనల్ పైకా గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఫుట్‌బాల్ జట్టు గోల్డ్ కప్‌ను కై వసం చేసుకుంది. అద్భుత ప్రతిభ, సమష్టి కృషితో ఫైనల్ పోరులో కేరళ జట్టుపై గెలుపొందింది. ఏపీ జట్టు సాధించిన విజయంలో భాగస్వామి అయిన అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన పాండవ మణికంఠకు స్థానికుల నుంచి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మణికంఠ తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాండవ ఈశ్వరరావు మాట్లాడుతూ పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారన్నారు. నారాయణ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తన కుమారుడు జిల్లా స్థాయిలో కనబర్చిన ప్రతిభతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఫుట్‌బాల్ టీమ్‌లో చోటు సంపాదించాడన్నారు. రైల్వే స్టేడియంలో కోచ్ వి.మధుసూదనరావు, శ్రీనివాస్ వద్ద శిక్షణ పొందుతున్నాడని తెలిపారు. మణికంఠ మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని అతడి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆకాంక్షించారు.

జూడో చాంపియన్‌కు ట్రాక్ సూట్ బహూకరణ


రుషిథాకు ట్రాక్ సూట్ అందజేస్తున్న బుల్లయ్య కళాశాల డైరెక్టర్ అజిత్

సీతంపేట: ఈ నెల 10 నుంచి 12 వరకు విజయవాడలో ఎన్‌టీఆర్ జిల్లా జూడో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ఇ.రుషిథా ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం రుషిథాను కళాశాల తరఫున డైరెక్టర్ అజిత్ అభినందిస్తూ ట్రాక్ సూట్‌ను బహూకరించారు. విద్యార్థినిని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి అభినందించారు.

లలితా పీఠంలో చండీ హోమం


చండీ హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో మాఘ మాసం బహుళ అష్టమి సందర్భంగా సోమవారం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల మధ్య గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోక కల్యాణార్థం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు అఘోర గౌరీ మృత్యుంజయ హోమం చేస్తామని, పాల్గొన దలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, లీడ్ బ్యాంక్ మేనేజర్ శర్మ

మహారాణిపేట: ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన అవసరమని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేపడుతున్న ఆర్థిక అక్షరాస్యత వారం–2023(ఫైనాన్షియల్ లిటరసీ వీక్)కు సంబంధించిన పోస్టర్‌ను లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.ఎస్.శర్మతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మన రక్షణకు మంచి ఆర్థిక ప్రవర్తన అనే నినాదంతో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని శర్మ తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సీఎఫ్ఎల్, ఎఫ్ఎల్సీ బ్యాంకుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఓటీపీ, పాస్‌వర్డ్స్, పిన్ లేదా ఖాతా వివరాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు.

గెడ్డలు దారుణం


పూడికతో నిండిన కర్రివాని గెడ్డ


శాంతిపురం గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

సీతంపేట: మెరుగైన పారిశుద్ధ్యం కోసం ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం అది కనిపించడం లేదనే చెప్పాలి. ఇందుకు దారుణంగా మారిన గెడ్డల తీరే నిదర్శనం. జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురం గెడ్డలో వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకు పోయాయి. 43వ వార్డు శ్రీనివాసనగర్ కర్రివాని గెడ్డ థర్మాకోల్, ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తాచెదారంతో నిండిపోయింది. ఇంటింటా చెత్త సేకరణ, చెత్త తరలింపు, గెడ్డల్లో పూడికల తొలగింపు సక్రమంగా జరగడం లేదని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిసర ప్రాంత ప్రజలు ఇంట్లోని వ్యర్థాలను కవర్లలో వేసి గెడ్డల్లో పడవేస్తున్నారు. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ఉన్న పలు వ్యాపార దుకాణాలు ఎలక్ట్రానిక్ పరికరాల ప్యాకింగ్‌లో ఉండే థర్మాకోల్‌ను గెడ్డల్లో పడేస్తున్నారు. ఇవన్నీ మురుగు నీటి ప్రవాహంతో కొట్టుకు వచ్చి గెడ్డల్లో ఒక చోట పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వార్డులో మెరుగైన పారిశుద్ధ్యం కోసం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.